


తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!
www.vaarhtanirbhayam.com
ఎడిటర్ కాడేపాగు అశోక్
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ



తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 90 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజిలు : 04, వెల రూ. 4రూ/ మంగళవారం- 24 - ఫిబ్రవరి - 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,

## కేరళ పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం



కేరళమ్‌గా కేరళ రాష్ట్రం పేరు కేరళ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

ఢిల్లీ : కేరళ రాష్ట్రం పేరును 'కేరళమ్ 'గా మార్చాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి మండలి మంగళవారం ఆమోదం తెలిపింది. నూతన పీఎంఓ కాంప్లెక్స్ 'సేవా తీర్థ్ 'లో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 'కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన తరువాత, భారత రాష్ట్రపతి 'కేరళ పేరు మార్పు బిల్లు, 2026'ను కేరళ రాష్ట్ర శాసనసభకు పంపిస్తారు.

## లైంగిక వేధింపుల కేసులో కోర్టు సంచలన తీర్పు

# జ్యోతిష్యుడికి 200 ఏళ్ల జైలు శిక్ష

- తమిళనాడులో పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు సంచలన తీర్పు
- బాలికలపై లైగింక వేధింపులకు పాల్పడ్డ జ్యోతిష్యుడికి 200ఏళ్ల జైలు శిక్ష



ఢిల్ : లైంగిక వేధింపుల కేసులో ఓ జ్యోతిష్యుడికి పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు 200 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే, బాధితులకు రూ. 2లక్షల పరిహారం చెల్లించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. వివరాల్లోకి వెళితే, 2021 నవంబర్ లో శివగంగ జిల్లా మానగిరి ప్రాంతానికి చెందిన రామకృష్ణన్ (52) అనే జ్యోతిష్యుడిని ఒక మహిళ ఆశ్రయించింది. తన కూమార్తెలకు చదువులో పురోగతి లేదంటూ రామకృష్ణన్ ను సంప్రదించింది. ఈ క్రమంలో తన వెంట ఇద్దరు కుమార్తెలను తీసుకుని రామకృష్ణన్‌ను వద్దకు వెళ్లింది. ఈ సమస్యకు ఏదైనా పరిష్కారం చూపాలంటూ జ్యోతిష్కుడిని తల్లి కోరింది. ఈ నేపథ్యంలో ఇద్దరు బాలికలకు తన ఇంటికి తీసుకురావాలని సూచించాడు జ్యోతిష్కుడు. ఇది నమ్మిన సదరు మహిళ తన ఇద్దరు కుమార్తెలను పూజారి ఇంటికి తీసుకెళ్లింది.

**బాలికలను గదిలోకి తీసుకెళ్లి!**

ఆ సమయంలో తల్లిని వేరే గదిలో ఉండమని చెప్పిన జ్యోతిష్కుడు, ఇద్దరు బాలికలను మిగతా..2లో

## రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా

# అమెరికాతో ట్రేడ్ డీల్

- యుద్ధ నిర్ణయం రాజకీయమే కానీ సైనికులది కాదని వ్యాఖ్య
- ఇండో, యూఎస్ ట్రేడ్ ఒప్పందం రైతులకు వ్యతిరేకమని ఆరోపణ
- పార్లమెంట్‌ను పక్కన పెట్టి ట్రంప్‌తో మోదీ డీల్ చేశారంటూ విమర్శ
- లోక్‌సభలో మాట్లాడనివ్వలేదని ఆవేదన



ఢిల్లీ : యుద్ధ నిర్ణయాల నుంచి అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వరకు అన్ని అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ భద్రత, రైతుల ప్రయోజనాలు, పార్లమెంటరీ వ్యవస్థ అన్నీ ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా జరిగిన రైతు మహాచౌపాల్ సభలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.

**ప్రధాని స్పందించలేదు: రాహుల్**

మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే తన పుస్తకంలోని చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన మిగతా..2లో

## మేం తట్టి లేపితేనే రివ్యూలా?'.. రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు నిప్పులు



- బీఆర్ఎస్ హయాంలో దేవాదుల పనులు 90 శాతం పూర్తయ్యాయన్న హరీశ్
- రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రేవంత్ ఫ్యూచర్ సిటీ కలలు కంటున్నారని వ్యాఖ్య
- ప్రభుత్వంపై రాజీ లేని పోరాటం చేస్తామని హెచ్చరిక

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరోసారి తారాస్థాయికి చేరింది.వరంగల్ పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు

# డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు

## దేవ్‌జీ, బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి

డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు దేవ్‌జీ, బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి

మావోయిస్టు నేతలు అజ్ఞాతం వీడటంతో ముగిసిన దండకారణ్య పోరు

డీజీపీ శివధర్ రెడ్డితో లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు



హైదరాబాద్: : తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట మావోయిస్టు అగ్రనేతలు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో అగ్రనేత దేవ్‌జీ, బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డిలు ఉన్నారు. లొంగిపోయిన నలుగురు మావోయిస్టులకు డీజీపీ రివార్డు చెక్కులను అందించారు. జగిత్యాల జైత్రయాత్రతో దేవ్ జీ : దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి ప్రస్తుతం మావోయిస్టు పార్టీ సెక్రటరీగా ఉన్నారు. తిప్పిరి తిరుపతి జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన వ్యక్తి. కోరుట్లలో ప్రాథమిక విద్య, కరీంనగర్‌లో ఇంటర్ విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఇంటర్ చేసేటపుడు విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. కరీంనగర్, కోరుట్ల ఆర్ఎస్‌యూ అధ్యక్షుడిగా పనిచేసిన తిరుపతి 1978లో జగిత్యాల జైత్రయాత్రతో ఆకర్షితుడయ్యాడు. అనంతరం1982లో సీపీఐఎంఎల్ పీపుల్స్ వార్‌లో చేరి 1984లో గణపతి సూచనలు చేయగా తిరుపతి, మల్లా రాజిరెడ్డి దండకారణ్యానికి వెళ్లారు. సెంట్రల్ మిలిటరీ కమిషన్ : మహారాష్ట్ర దండకారణ్యంలో దేవ్‌జీ అజ్ఞాత జీవితం గడిపారని డీజీపీ పేర్కొన్నారు. తిరుపతి గడ్చిరోలి జిల్లా కార్యదర్శిగా దేవ్‌జీ పనిచేశాడని 2001లో సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా పదోన్నతి పొందినట్లు తెలిపారు. మిగతా..2లో

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వాస్తవాలన్నీ ప్రజల

# ముందుంచుతాం

హైదరాబాద్ పాతబస్తీలోని భాగ్యలక్ష్మీ ఆలయం వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్ మొక్కులు చెల్లించుకున్నారు.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి ఆలయాన్ని సందర్శించారాయన.



హైదరాబాద్: భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులతోనే కరీంనగర్‌లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. పాతబస్తీలోని భాగ్యలక్ష్మీ ఆలయం వద్ద మొక్కులు తీర్చుకునేందుకే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మీ ఆలయం ఎంతో పవర్‌ఫుల్ అని, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయం తరహాలో ఈ ఆలయాన్నీ గోల్డెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. పాతబస్తీ హిందువులకు భాగ్యలక్ష్మీ అమ్మవారు రక్షణగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ప్రజా సంగ్రామ యాత్రను భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులతో ప్రారంభించామని, కేసీఆర్ ప్రభుత్వ అడ్డంకులను ఎదుర్కొని 1640 కిలోమీటర్ల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశామని బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్‌లో హిందూ సమాజానికి మిగతా..2లో

# పులివెందులలో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన జగన్



భాకరాపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యల స్వీకరణ

నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొననున్న మాజీ సీఎం

ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

అమరావతి : వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పర్యటన ప్రారంభించారు. ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగుతోంది. ఇందులో భాగంగా ఆయన ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. (మంగళవారం) పులివెందుల చేరుకున్న జగన్‌కు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించి మిగతా..2లో

# ఆపరేషన్ ఆక్టోపస్... డీటెయిల్స్ వెల్లడించిన సజ్జనార్



'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో దేశవ్యాప్త సైబర్ ముఠా అరెస్ట్

16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు.. 104 మంది అరెస్ట్

నిందితులకు సహకరించిన బంధన్ బ్యాంక్ అధికారి కూడా అరెస్ట్

దేశవ్యాప్తంగా 1,055 కేసుల్లో ₹27 కోట్ల మోసాలు చేసినట్లు గుర్తింపు

₹36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు స్వాధీనం

హైదరాబాద్ : హైదరాబాద్ పోలీసులు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో, దేశంలోని 16 రాష్ట్రాల్లో విస్తరించిన అతిపెద్ద సైబర్ నేరాల ముఠా గుట్టురట్టు చేశారు. పెట్టుబడులు, ట్రేడింగ్, 'డిజిటల్ అరెస్ట్' వంటి మోసాలతో అమాయక ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న మిగతా..2లో

## గత ప్రభుత్వ అధినేత తప్పు చేశారని నేనెప్పుడూ చెప్పలేదు



- తిరుమల లడ్డూ నెయ్యి కల్తీకి గత టీటీడీ పాలకమండలే పూర్తి బాధ్యత వహించాలన్న పవన్
- నెయ్యిలో పాలు లేవని, రసాయనాలతో తయారు చేశారని సిట్ నివేదిక తేల్చిందని వెల్లడి
- తమకు నచ్చిన సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చేందుకు టెండర్ నిబంధనలు మార్చారని ఆరోపణ
- హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు అందరూ ఏకతాటిపై ఖండించాలని పిలుపు

అమరావతి : తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన నెయ్యి కల్తీ వ్యవహారంలో గత ప్రభుత్వ అధినేత తప్పు చేశారని తాను ఎప్పుడూ నిందించలేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఆనాడు నియమితులైన టీటీడీ పాలకమండలిదే పూర్తి బాధ్యత అని పేర్కొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర బిసి రాజకీయ ముఖచిత్రం మారనుందా?

బీసీలలో విద్య, ఉద్యోగ, రాజకీయపరంగా వచ్చిన చైతన్యమే ఈ ఫలితాలు.



హైదరాబాద్ ఫిబ్రవరి 24 (వార్త నిర్భయం) రెండు నెలల క్రితం ముగిసిన పంచాతీయ ఎన్నికలు, ఇటీవల ముగిసిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలలో బీసీలు తమ సత్తా చాటుకున్నారు. రాష్ట్రంలో తమ జనాభా దామాషాకు మించి పట్టణ స్థానిక సంస్థల చైర్ పర్సన్ల పదవుల్లో 61%, డిప్యూటీ చైర్ పర్సన్ల పదవుల్లో 41%, పంచాయతీ సర్పంచ్ పదవుల్లో 50%కు పైగా దక్కించుకున్నారు. ఇది రాష్ట్ర రాజకీయ యవనికపై వస్తున్న మార్పును స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ ఫలితాలు వెనుకబడిన తరగతులలో నూతనోత్సాహాన్ని ఇస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మూడు శాసనసభ ఎన్నికలలో బీసీల ప్రాతినిధ్యం 20కు మించలేదు.వారి జనాభా దామాషా కంటే చాలా తక్కువ స్థానాలు వచ్చాయి. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34% రిజర్వేషన్లు ఉండేవి.ఆ తరువాత న్యాయస్థానాల తీర్పుల కారణంగా 20% కంటే తక్కువ స్థానాలను కేటాయించడం జరిగింది. 2025 డిసెంబర్‌లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు, 2026 ఫిబ్రవరిలో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వలేదు. రాష్ట్రాలకు అక్కడి జనాభాకు అనుగుణంగా వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించుకోవచ్చని రాజ్యాంగం వెసులుబాటు కల్పించింది అయినప్పటికీ, అధికారిక గణాంకాలు లేవనే నెపంతో న్యాయస్థానాలు అడ్డుపడుతున్నాయనే భావన బీసీలలో బలంగా నాటుకుపోయింది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు రాజకీయంగా, విద్యాపరంగా, ఉద్యోగాలలో 42% రిజర్వేషన్లు కల్పిస్తానని కామారెడ్డి డిక్లరేషన్ పేరిట హామీ ఇచ్చింది. ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులు, న్యాయపరమైన చిక్కుల పరంగా అసాధ్యమని తెలిసినా, కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేయడం ఒక మూలమలుపుగా చెప్పవచ్చు. బీసీలలో పెరుగుతున్న రాజకీయ చైతన్యాన్ని గమనించే ఆ పార్టీ ఇలా వాగ్దానం చేసింది. తరువాత అధికారంలోకి వచ్చింది. అయితే అసెంబ్లీ ఎన్నికలలో కేవలం 19 మంది బీసీలు మాత్రమే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. కానీ ఆ పార్టీ రాజేసిన 42% రిజర్వేషన్ల చిచ్చుమాత్రం ఆరిపోలేదు.శాసనసభలో తమ జనాభా దాషామాకు అనుగుణంగా ఎమ్మెల్యేలు గెలవకపోయినా, రాజకీయంగా తమకున్న ప్రాముఖ్యతను బీసీ డిక్లరేషన్ ముందుకు తెచ్చిందనే భావన వారిలో బలంగా నాటుకుపోయింది. దీనిపై ప్రస్తుత రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య(బీజేపీ) నేతృత్వంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘంతో పాటు అన్ని బీసీ సంఘాలు నిరంతరం ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాయి.ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో(కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండటం) అసాధ్యమైన ఎన్నికల వాగ్దానాన్ని అమలు చేయడంపై అధికార కాంగ్రెస్ పార్టీ మీన మేషాలు లెక్కిస్తూ కాలక్షేపం చేసింది.వాగ్దాన భంగమవుతుందనే కారణంతో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చింది.అనివార్యమైన పరిస్థితులలో జీవోలు, ఆర్డినెన్స్ పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించింది. కానీ, హైకోర్టు జీవోను రద్దు చేసింది. చివరకు 2025 డిసెంబర్‌లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికలలో బీసీలకు అధికారికంగా 17% రిజర్వేషన్లు మాత్రమే దక్కాయి. కానీ, ఎన్నికలలో అనూహ్యంగా బీసీలు 50%కు పైగా స్థానాలు దక్కించుకున్నారు. 10,223 నాన్ షెడ్యూల్ గ్రామ పంచాయతీలలో మిగతా..2లో

వార్త నిర్భయం
బుధవారం- 25 - ఫిబ్రవరి - 2026

# మొదటి పేజి తరువాయి

## పులివెందులలో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన జగన్

వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రికి ఆయన అక్కడే బస చేయనున్నారు. పర్యటనలో భాగంగా రేపు (బుధవారం) ఉదయం 9:30 గంటలకు జగన్ వేంపల్లి మండలం నందిపల్లి గ్రామానికి వెళ్తారు. అక్కడ నూతనంగా నిర్మించిన నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం పులివెందులకు తిరిగి వచ్చి, మధ్యాహ్నం మరోసారి క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడానికే ఈ పర్యటన చేపట్టారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

## డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు

మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యి 2017లో సెంట్రల్ మిలిటరీ కమిషన్ పూర్తి ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టినట్లు ఆయన వివరించారు. మల్లోజుల వేణుగోపాల్ బయటకు వచ్చాక మావోయిస్టు అధికార ప్రతినిధిగా దేవ్‌జీ వ్యవహరించారని, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ ఇన్‌ఛార్జ్‌గా దేవ్‌జీ వ్యవహరిస్తున్నారని డీజీపీ వెల్లడించారు. రాజిరెడ్డిది మంథని శాస్త్రపల్లి గ్రామం : మల్లా రాజిరెడ్డి సెంట్రల్ కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నారని ఆయన స్వస్థలం పెద్దపల్లి జిల్లా మంథని మండలం శాస్త్రపల్లి గ్రామమని తెలిపారు. మల్లా రాజిరెడ్డిది వ్యవసాయ కుటుంబ నేపథ్యమన్న డీజీపీ 1975లో పెళ్లి తర్వాత భార్య రత్నమ్మతో అజ్ఞాతంలోకి వెళ్లారన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో 1998లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రత్నమ్మ చనిపోయారని అన్నారు. మల్లా రాజిరెడ్డి 1974లో ఆర్‌ఎస్‌యూలో చేరి కిషన్‌జీ మావోయిస్టు సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడయ్యారన్నారు. 1980లో సీపీఐఎంఎల్ పీడబ్ల్యూ ప్రారంభించాక బొగ్గు గనుల ప్రాంతంలో ఉద్యమ నిర్మాణానికి కృషి చేసినట్లు తెలిపారు. జైలు నుంచి తప్పించుకుని : 1988లో ఆదిలాబాద్ జైలు నుంచి మల్లా రాజిరెడ్డి తప్పించుకున్నారని అక్కడ మంగీ సారథ్యంలో ఈయన పనిచేసినట్లు డీజీపీ తెలిపారు. గడ్చిరోలిలో డివిజనల్ కమిటీ కార్యదర్శిగా పనిచేసిన రాజిరెడ్డి 1987లో దండకారణ్య కమిటీ తొలి కార్యదర్శిగా ఎదిగి 1990లో సెంట్రల్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. 2001లో సౌత్, వెస్ట్ రీజినల్ బ్యూరో ఇన్‌ఛార్జ్‌గా రాజిరెడ్డిని నియమించారని, 2007లో పొలిట్ బ్యూరో సభ్యుడిగా, 2007లో కేరళలో అరెస్టై, 2009లో విడదల్యాయక మళ్లీ అజ్ఞాతవాసం బాట పట్టినట్లు వివరించారు. 2010-16 మధ్య సీవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా, 2017లో ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శి, 2022 నుంచి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారని వెల్లడించారు. "మేం ప్రజల సమస్యలపై వారి తరఫున కలిసి పనిచేస్తాం. పార్లమెంటరీ వ్యవస్థలోకి వెళ్లాలనేది మా ఉద్దేశం కాదు. ప్రజల సమస్యలపై జరిగే పోరాటాలను సంఘటితం చేయడం కోసం చట్ట పరిధిలో పనిచేయాలని లోతుగా ఆలోచించాం. అవకాశం ఉన్నప్పుడల్లా ప్రజల పోరాటాలకు మద్దతుగా నిలబడతామని హామీ ఇస్తున్నాం. మావోయిజం మాత్రం ఎప్పటికీ ముగిసిపోదు. ప్రపంచవ్యాప్తంగా అది అభివృద్ధి చెందుతూనే ఉంటుంది" -మల్లా రాజిరెడ్డి తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాల పునరావాస పథకం ప్రకారం, వీరికి లభించే మొత్తం రూ. 90 లక్షల నగదు బహుమతిని చెక్కుల రూపంలో చెల్లిస్తారు. అలాగే తెలంగాణ పోలీసు శాఖ, తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం కింద వీరికి లభించాల్సిన అన్ని ప్రయోజనాలను తక్షణమే అందిస్తామని డీజీపీ తెలిపారు.

## జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో వాస్తవాలన్నీ ప్రజల ముందుంచుతాం

ఏ ఆపద వచ్చినా అడ్డుకునేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేసిన బండి సంజయ్.. ఆలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం, బంజారాహిల్స్ పెద్దమ్మ ఆలయం, శంషాబాద్ ఆలయాలపై దాడులు జరిగాయన్నారు. బాన్సువాడలో హిందువులపై రాళ్లదాడి జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని, అమాయకులను అరెస్ట్ చేయడం సరికాదని కేంద్ర మంత్రి మండిపడ్డారు. పోలీసులు అక్రమ అరెస్టులను ఆపాలని హెచ్చరించారు. అవసరమైతే తానే బాన్సువాడకు వెళ్లి హిందువులకు రక్షణగా నిలుస్తానన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగులకు బకాయిలు, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతామని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## మేం తట్టి లేపితేనే రివ్యూలా?'.. రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు నిప్పులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యంగా వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల జాప్యంపై ఆయన నిప్పులు చెరిగారు. "మేము క్షేత్రస్థాయికి వచ్చి తట్టి లేపితేనే ముఖ్యమంత్రి నిద్ర లేస్తున్నారని... మేము ప్రాజెక్టులను విజిట్ చేసిన వెంటనే ఆయన రివ్యూలు నిర్వహిస్తున్నారు" అంటూ ఎద్దేవా చేశారు. దేవాదుల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును హరీశ్ రావు ఎండగట్టారు. తమ ప్రభుత్వ హయాంలోనే 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులను పూర్తి చేయడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా, ఒక్క ఎకరా భూమిని కూడా సేకరించలేదని, కొత్తగా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేదని విమర్శించారు. దేవాదుల తమకు మొదటి ప్రాధాన్యత అని చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదని, కేవలం డెడ్ లైన్లు మార్చుకుంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. పేదల ఆరోగ్యం కోసం కేసీఆర్ 'హెల్త్ సిటీ' నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం 'ఫ్యూచర్ సిటీ' కలలు కంటున్నారని హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను అటకెక్కించారని ఆరోపించారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి పరిస్థితి దయనీయంగా మారిందని, ఏడాదిన్నరగా గుండె ఆపరేషన్లు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాము ఏర్పాటు చేసిన మూడు ఆక్సిజన్ ప్లాంట్లలో ప్రస్తుతం ఒక్కటి కూడా పనిచేయకపోవడం ఈ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పాలనలో విఫలమైన ప్రభుత్వంపై ఇకనుంచి రాజీలేని పోరాటం చేస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. "రెండేళ్లు ఓపిక పట్టాం.. ఇక గల్లా పట్టి అడుగుతాం" అంటూ ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. అసెంబ్లీలో కెమెరాలు తిప్పకుండా, మైకులు కట్ చేయకుండా తమతో చర్చించే దమ్ము ముఖ్యమంత్రికి ఉందా అని సవాల్ విసిరారు. అభివృద్ధి పనుల్లో ఇదే నిర్లక్ష్యం కొనసాగితే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన దీక్షలకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

## కేరళ పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్- 3 ప్రకారం, కేరళ రాష్ట్రం తన అభిప్రాయాన్ని తెలియజేసేందుకు ఈ ప్రక్రియను చేపడతారు. కేరళ శాసనసభ అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాత, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి సిఫారసుతో పార్లమెంట్ లో కేరళ పేరు మార్పు బిల్లు- 2026ను ప్రవేశపెడుతుంది' అని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి కేరళ పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ 2024 జూన్ 24న కేరళ శాసనసభ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. "మలయాళం భాషలో రాష్ట్రం పేరు 'కేరళం'. 1956 నవంబర్ 1న భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడ్డాయి. కేరళ పిరవి దినం కూడా నవంబర్ 1నే జరుగుతుంది. వాస్తవానికి స్వాతంత్ర్య పోరాట కాలం నుంచే మలయాళం మాట్లాడే వారందరికీ కలిపి 'ఐక్య కేరళం' కావాలనే డిమాండ్ బలంగా ఉండేది. అయితే రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్ లో మాత్రం 'కేరళ' అని నమోదు చేశారు. అందుకే ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం" అని 2024లో చేసిన ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

రాష్ట్రాల పేర్లు ఇలా మార్చవచ్చా?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, ఇప్పటికే ఉన్న రాష్ట్రాల పేర్లను మార్చే అధికారం పార్లమెంట్ కు ఉంటుంది. అయితే ఇలాంటి బిల్లును రాష్ట్రపతి సిఫారసు లేకుండా పార్లమెంట్ లో ప్రవేశపెట్టడానికి వీల్లేదు. అంతేకాదు సంబంధిత రాష్ట్ర శాసనసభకు ఆ బిల్లును పంపి నిర్ణీత సమయంలోగా అభిప్రాయాలను కోరాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే కేరళ రాష్ట్రం పేరు మార్పు అంశాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిశీలించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆమోదంతో డ్రాఫ్ట్ కేబినెట్ నోట్ ను న్యాయవ్యవహారాల శాఖ, శాసన సభ విభాగాలకు, న్యాయమంత్రిత్వ శాఖలకు పంపారు. వారు కూడా ఈ ప్రతిపాదనకు తమ సమ్మతిని తెలియజేశారు.

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

మంగళవారం కేంద్ర కేబినెట్ కేరళ పేరు మార్పుతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా బాలికలందరికీ ఉచితంగా హెచ్ పీవీ వ్యాక్సినేషన్ చేయించాలని తీర్మానించింది. అలాగే 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్దాసిల్ ఇంజెక్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. మరోవైపు శ్రీనగర్ లో రూ.1667 కోట్లతో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి, రూ.1667 కోట్లతో అహ్మదాబాద్ మెట్రో విస్తరణకు ఆమోదం తెలిపింది. అలాగే విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించింది.

## ఆపరేషన్ ఆక్టోపస్... డీటెయిల్స్ వెల్లడించిన సజ్జనార్

ఈ నెట్‌వర్క్‌కు చెందిన 104 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయి. అమాయకులను నమ్మించి, భయపెట్టి, వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న ఘటనలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో డీసీపీ (సైబర్‌క్రైమ్స్) వి. అరవింద్ బాబు నేతృత్వంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు (జజ్బూ) ఈ మోసాలపై లోతైన దర్యాప్తు చేపట్టారు. నేరగాళ్లు బాధితుల నుంచి దోచుకున్న సొమ్మును మళ్లించడానికి ఉపయోగిస్తున్న 151 బ్యాంకు ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ఆధారంగా దేశవ్యాప్తంగా విస్తరించిన ముఠా వివరాలను ఛేదించారు. ఈ భారీ నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకిలించేందుకు 32 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల నేతృత్వంలోని ఈ బృందాలు 10 రోజుల పాటు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో ఏకకాలంలో మెరుపుదాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో మొత్తం 104 మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో 86 మంది 'మ్యూల్ అకౌంట్ హోల్డర్లు' ఉన్నారు. వీరు తమ బ్యాంకు ఖాతాలను కమీషన్ కోసం సైబర్ నేరగాళ్లకు అప్పగించారు. మరో 17 మంది ఈ ఖాతాలను సేకరించి ముఠా సూత్రధారులకు అందించే ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ ముఠాతో కుమ్మక్కై నకిలీ ఖాతాలు తెరిచేందుకు సహకరించిన బంధన్ బ్యాంకుకు చెందిన ఓ రిలేషన్‌షిప్ మేనేజర్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన ఈ నిందితులకు దేశవ్యాప్తంగా నమోదైన 1,055 సైబర్ ఫ్రాడ్ కేసులతో సంబంధం ఉన్నట్లు తేలిందని, ఈ మోసాల మొత్తం విలువ సుమారు రూ.127 కోట్లు ఉంటుందని కమిషనర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు, 141 సిమ్ కార్డులు,

# తెలంగాణ రాష్ట్ర బిసి రాజకీయ ముఖచిత్రం మారనుందా?



### మొదటి పేజి తరువాయి

వారికి రిజర్వు చేసిన 2,186 పంచాయతీలతో సహా 2,937 జనరల్ స్థానాల్లోనూ విజయం సాధించారు.మొత్తం 5,123 సర్పంచ్ స్థానాలను దక్కించుకున్నారు. తెలంగాణ పంచాయతీ ఎన్నికలు గ్రామ పాలనలో బీసీలు ఇక అనివార్య రాజకీయ శక్తిగా మారారని చాటిచెప్పాయి. మున్సిపల్ ఛైర్మన్ పదవుల్లో ఏకంగా 60.95% సొంతం చేసుకుని, పట్టణాల్లో ప్రథమ పౌరులుగా అందలమెక్కారు. ఎన్నికలు పూర్తయిన 105 మున్సిపాలిటీల్లో 64 మంది బీసీలే ఛైర్‌పర్సన్లుగా ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్ల పదవుల్లోనూ 41% మంది బీసీలే ఉన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్లలోనూ బీసీలు సత్తా చాటారు. ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా, నాలుగు కార్పొరేషన్లలో బీసీలే మేయర్ పదవులు దక్కించుకున్నారు. మొత్తం పదవుల్లో ఇది 57.14%. స్థానిక సంస్థలలో సాధించిన విజయాలు రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మారుస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఫలితాల నేపథ్యంలో 2028 ఎన్నికలలో బీసీని ముఖ్యమంత్రిని చేయాలనే డిమాండ్‌ను బీసీ సంఘాల నాయకులు ముందుకు తెస్తున్నారు. బీసీలలో విద్య, ఉద్యోగ, రాజకీయపరంగా వచ్చిన చైతన్యమే ఈ ఫలితాలు: ఆర్ కృష్ణయ్య, రాజ్యసభ సభ్యులు 1970ల నుంచి రాష్ట్రంలో నిరంతరం సాగుతున్న బీసీ ఉద్యమం ఫలాలు ఇప్పుడు రాజకీయంగా పరిపక్వతకు వచ్చాయని ఆర్ కృష్ణయ్య అన్నారు. అంతేకాకుండా, "బీసీలలో ఇప్పటికీ ఆర్థిక వెనుకబాటు ఉన్నప్పటికీ, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, ఫీజు రీయింబర్స్ మెంట్‌వంటి పథకాలతో లబ్ధి పొందారు. ఉన్నత ఉద్యోగాలు పొందారు. ఆర్థికంగా బలపడ్డారు. రాజకీయంగా చైతన్యవంతులయ్యారు. రాజ్యాధికారం ఉన్నప్పుడే హక్కులు సాధించుకోగలమనే స్పృహతో బీసీలు సంఘటితమవుతున్నారు" అని చెప్పుకొచ్చారు. "2014 నుంచి బీసీ ముఖ్యమంత్రి నినాదం ముందుకు వచ్చింది. ఈసారి ఈ డిమాండ్ మరింత బలంగా మారనుంది" అని అన్నారు.

### వాగ్దానాల వైఫల్యం, నిరుద్యోగం కారణంగానే ఈ ఫలితాలు:

డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్రంలో రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలు సంఘటితం కావడం మొదలైందని, దాని ఫలితమే ఈ విజయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. బీసీలలో పెరుగుతున్న నిరుద్యోగం కూడా ఒక కారణంగా చెప్పారు. బీసీ నిరుద్యోగ యువత రాజకీయాల్లోకి చురుగ్గా వస్తున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా రాజకీయంగా సంఘటితమై తమ అభ్యర్థులను గెలిపించుకుంటున్నారని పేర్కొన్నారు.జనాభా దామాషాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించడానికి న్యాయవ్యవస్థ అడ్డుపడటం కూడా బీసీలలో పట్టుదలని పెంచుతోంది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు అడ్డురాని 50% రిజర్వేషన్ పరిమితి బీసీల విషయంలో ఎందుకు ముందుకు తెస్తున్నారు"అని అరుణ్ కుమార్ ప్రశ్నించారు. బీసీల అణచివేతకు రాజకీయంగా, న్యాయపరంగా జరుగుతున్న ప్రయత్నాలకు ప్రతిఘటనే ఈ ఫలితాలని పేర్కొన్నారు. "గత ఐదు దశాబ్దాలుగా జరుగుతున్న బీసీ ఉద్యమం కారణంగా- విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కారణంగా బీసీలు ఆర్థికంగా కూడా కొంత వరకు బలపడ్డారు. అటువంటి వారు రాజకీయాల్లోకి వచ్చి, అగ్రవర్ణాలతో సమానంగా ఎన్నికలకు ఖర్చు పెట్టగలిగారు"అని తెలియజేశారు. "అగ్రవర్ణాలు ఏ విధంగానైతే పార్టీలకు అతీతంగా ఎలా సహకరించుకున్నారో, స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా బీసీలు సంఘటితమై తమ అభ్యర్థులను గెలిపించుకున్నారు. ఈ ప్రభావం రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై తప్పకుండా ఉంటుంది"అని అరుణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. 78 సంవత్సరాల రాజకీయ అణచివేతపై తిరుగుబాటే ఈ ఫలితాలు: బాలరాజ గౌడ్ బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ "స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలవుతున్నా బీసీలు ఇంకా అణచివేతకు గురవుతున్నారు. ఆ అణచివేతపై తిరుగుబాటుగానే ఈ ఫలితాలను చూడాలి. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఇవే ఫలితాలు రాబోతున్నాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు కలిపి 100కు పైగా అసెంబ్లీ స్థానాలు గెలుచుకోబోతున్నారు. బీసీ అభ్యర్థి ముఖ్యమంత్రి కావాలనే డిమాండే ఈసారి ప్రధాన అజెండాగా ఉంటుంది"అని బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలరాజ్ గౌడ్ "ది వైర్"కు తెలిపారు. తెలంగాణ ఉద్యమం కారణంగా వాయిదా పడిన బీసీ ఉద్యమం మళ్లీ ఊపందుకుంది: బాణాల అజయ్ కుమార్, అడ్వొకేట్, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ "ఇది శుభపరిణామం. బీసీలలో స్పష్టమైన చైతన్యానికి ఇది నాంది. రాబోయే రోజులలో రాజ్యాధికారం దిశగా ముందుకు వెళ్తుంది. తెలంగాణ ఉద్యమం కారణంగా బీసీ వాదం 20 సంవత్సరాలు వెనుకబడింది. ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ బాపూజీవంటి ఉద్దండులు ముందు తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ప్రాధాన్యతమిచ్చారు. ఈ తరుణంలో రాష్ట్రంలో బీసీ ఉద్యమానికి కొంత విరామం వచ్చింది. మళ్లీ ఇప్పుడు ముందుకు వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై తప్పకుండా ఉంటుంది. బీసీ ముఖ్యమంత్రి కావాలనే నినాదం తప్పకుండా ముందుకు వస్తుంది" అని అడ్వొకేట్, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాణాల అజయ్ కుమార్ తెలిపారు. అత్యంత వెనుకబడిన కులాల ప్రాతినిధ్యం లేదు: మురళీ, ఎంబీసీ సంఘం నాయకుడు ఇప్పుడు వచ్చిన ఫలితాలు నాణేనికి ఒక వైపు మాత్రమేనని ఎంబీసీ సంఘం నాయకుడు మేదర మురళీ అభిప్రాయపడ్డారు. "బీసీలలో ఆర్థికంగా, రాజకీయంగా బలపడిన నాలుగు ఆధిపత్య కులాలు మాత్రమే అగ్రవర్ణాలతో సమానంగా పోటీపడి స్థానాలు గెలుచుకోగలిగాయి. కులాధిపత్యం ముందుకు వచ్చింది. అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా బీసీలలోని ఆధిపత్య కులాలు సంఘటితమై విజయాన్ని దక్కించుకున్నాయి. కానీ, బీసీలలోని మిగతా కులాలకు కనీస ప్రాతినిధ్యం కూడా దక్కలేదు. వార్డు సభ్యులుగా కూడా పోటీ చేయలేకపోయారు. అత్యంత వెనుకబడిన కులాలకు కూడా ప్రాతినిధ్యం దక్కినప్పుడు మాత్రమే బీసీలు విజయం సాధించినట్లు భావించాలి"అని అన్నారు.

### మరింత చైతన్యానికి నాంది ఈ ఫలితాలు: అంబాల నారాయణ గౌడ్

"బీసీలు ఈ స్థాయిలో విజయాలు దక్కించుకోవడం రాజకీయాలపై తప్పకుండా ప్రభావం చూపుతుంది. చట్టసభలలో జనాభా వాటాకు అనుగుణంగా ప్రాతినిధ్యం పెంచుకోవడానికి ఈ ఫలితాలు ప్రేరణగా నిలుస్తాయి"అని గౌడ, కల్లుగీత సంఘాల జేఏసీ కన్వీనర్ అంబాల నారాయణ గౌడ్ పేర్కొన్నారు.

# రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా అమెరికాతో ట్రేడ్ డీల్

### మొదటి పేజి తరువాయి

రాహుల్, చైనా ట్యాంకులు సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు ఆదేశాల కోసం రక్షణ మంత్రికి ఫోన్ చేసినా స్పందన రాలేదని నరవణే రాశారని చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఎవరూ స్పందించలేదని ఆయన పేర్కొన్నారని తెలిపారు. చివరికి యుద్ధ నిర్ణయం ప్రధాని తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రధాని స్పందించలేదని, ఆర్మీ చీఫ్‌ను ఒంటరిగా వదిలేశారని రాహుల్ వ్యాఖ్యానించారు. యుద్ధం చేయాలా వద్దా అన్నది రాజకీయ నిర్ణయమని, అది సైన్యానికి మోపలేమని స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా అమెరికాతో ఒప్పందం!

ఇక ఇండో యూఎస్ ట్రేడ్ ఒప్పందంపై కూడా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాతో కుదిరిన ఈ ఒప్పందం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా ఉందని చెప్పారు. ఐదు నెలల పాటు వ్యవసాయ ఉత్పత్తుల అంశం కారణంగా ఈ ఒప్పందం నిలిచిపోయిందని, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రభుత్వం కూడా అంగీకరించలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ నుంచి బయటకు వెళ్లి నేరుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు ఫోన్ చేసి ఒప్పందానికి సిద్ధమని చెప్పారని ఆరోపించారు.

### స్టీన్ ఫైళ్ల వెనుక అనుమానాలు

"నాలుగు నెలలు ఏమీ జరగలేదు. ఒక్కసారిగా ప్రధాని కాల్ చేసి రైతులను అమ్మేశారు. గార్మెంట్ రంగాన్ని కూడా నష్టపరిచారు. దేశ డేటాను అమెరికాకు అప్పగించారు" అంటూ విమర్శించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రధానికి సవాల్ విసిరారు. అమెరికాలో ఎప్ స్టీన్ కేసుకు సంబంధించిన లక్షల ఫైళ్లు ఉన్నాయని, అవి వెలుగులోకి రాకపోవడం వెనుక కూడా అనేక అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా అదానీ పేరే వినిపిస్తోందని, ఆ సంస్థ కేవలం కంపెనీ కాదని, బీజేపీ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా మారిందని ఆరోపించారు. "అమెరికా సుప్రీంకోర్టు నిర్ణయం తర్వాత ఇతర దేశాలు యూఎస్ తో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని నిర్ణయించుకున్నాయి. కానీ ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ఈ వేదిక నుంచి నేను మోదీని సవాలు చేస్తున్నా. అమెరికా సుప్రీంకోర్టు ఈ ఒప్పందంపై తీర్పు ఇచ్చిన తర్వాత, అమెరికాతో ఒప్పందాన్ని రద్దు చేయండి. ట్రంప్ ఒత్తిడి కారణంగా ఆయన ఒప్పందాన్ని రద్దు చేయలేరు. భారత్ లో అత్యధిక జనాభా, అత్యధిక డేటా ఉంది. కానీ ప్రధాని మోదీ మన డేటా మొత్తాన్ని అమెరికాకు ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి లేకపోతే, ఆయన ఇలా చేసి ఉండేవారు కాదు. తన ఇమేజ్‌ను, రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి ఆయన భారతదేశాన్ని అమ్మేశారు" అని రాహుల్ ఆరోపించారు.

### ప్రజలతో కలిసి పోరాటం

పార్లమెంటరీ వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది తొలిసారి లోక్‌సభ ప్రతిపక్ష నేతకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని తెలిపారు. లోక్‌సభ లో ప్రసంగం ప్రారంభించగానే అడ్డుకున్నారని, తన మాట వినిపించనివ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలు, జాతీయ భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థ అంశాల్లో కేంద్రం బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలు ముందుకు రావొద్దని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

# లైంగిక వేధింపుల కేసులో కోర్టు సంచలన తీర్పు- జ్యోతిష్యుడికి 200 ఏళ్ల జైలు శిక్ష

### మొదటి పేజి తరువాయి

మరో గదికి తీసుకెళ్లాడు. అనంతరం, బాలికలిద్దరిపై లైంగిక దాడికి పాల్పడ్డాడని సదరు మహిళా ఆరోపించారు. అంతేకాకుండా, ఈ విషయాన్ని బయటపెడితే తల్లిదండ్రులకు కీడు జరుగుతుందని ఆ బాలికలను బెదిరించాడు జ్యోతిష్కుడు. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడు. దీంతో తల్లిదండ్రులకు ఏమీ కాకూడదని భావించిన ఆ బాలికలు జరిగిన విషయం గురించి ఎవరికీ చెప్పలేదు.

### అసలు విషయం ఇలా వెలుగులోకి!

ఈ ఘటన జరిగి దాదాపు రెండు సంవత్సరాలు గడిచింది. ఈ సంఘటన జరిగిన సమయంలో ఆ ఇద్దరు బాలికల్లోని ఒకరి వయసు 18కాగా, ఇంకొకరి వయసు 14. గతకొంతకాలంగా బాలికలిద్దరికి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో వారిని పరీక్షించిన వైద్యులు బాలికలకు లైంగికంగా సంక్రమించే వ్యాధి ఉందని చెప్పారు. ఇది విన్న వారి తల్లిదండ్రులు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. పిల్లలిద్దరిని విచారించగా జ్యోతిష్కుడు చేసిన నిర్వాకం బయటపడింది. దీంతో బాలికల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పూజారిపై తిరుపత్తూరు ఉమెన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

### తీర్పు వెలువరించిన జడ్జి

ఈ కేసు సంబంధించిన విచారణ మంగళవారం రోజు శివగంగ జిల్లా పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టులో జరిగింది. జ్యోతిష్కుడు రామకృష్ణన్‌కు మొత్తం 200 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తున్నట్లు జడ్జి గోకుల్ మురుగన్ తీర్పు వెల్లడించారు. అదేవిధంగా, బాధితులకు ఒక్కొక్కరికి రూ.10లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

### మరో అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

ఇదిలా ఉండగా, హరియాణాలోని ఫతేహాబాద్‌లో ఇలాంటి ఘటనే జరిగింది. బాలికపై అత్యాచారం చేసిన ఓ వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది ఫాస్ట్-ట్రాక్ కోర్టు. ఈ మేరకు అదనపు సెషన్స్ జడ్జి సోమవారం తీర్పు వెల్లడించారు. అలాగే ఈ కేసులో నిందితుడికి రూ.1.70 లక్షల జరిమానా కూడా విధించింది.

అసలేం జరిగింది?

ఈ సందర్భంగా విచారణ జరిపిన జడ్జి కేసు వివరాలు వెల్లడించారు. "2024 నవంబర్ 13 నాటిది. 14 ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగిందని బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు గత 10 నెలలుగా పాఠశాలకు వెళ్తున్న తన కుమార్తెను ప్రలోభపెట్టాడని, మూడు వారాల క్రితం పొలాల్లోకి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడని బాధితురాలి తండ్రి ఆరోపించారు. అంతేకాదు, బాధితురాలు ప్రతిఘటించినప్పుడు ఆమెను కొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు" అని ఫతేహాబాద్ జిల్లా న్యాయవాది దేవేందర్ మిట్టల్ పేర్కొన్నారు. సాక్ష్యాలు, వాంగ్మూలం ఆధారంగా నిందితుడికి

# గత ప్రభుత్వ అధినేత తప్పు చేశారని నేనెప్పుడూ చెప్పలేదు

### మొదటి పేజి తరువాయి

అసెంబ్లీలో ఈ అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, దోషులను వెనకేసుకు రాకుండా, చట్ట ప్రకారం విచారణకు సహకరించాలని సూచించారు. ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు ఎన్డీఏ సమావేశంలో నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్డీడీబీ) నివేదికను ప్రస్తావించిన తర్వాతే తనకు పూర్తి వివరాలు తెలిశాయన్నారు.

### పాల చుక్క లేకుండా రసాయనాలతో నెయ్యి

సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదికలోని అంశాలను పవన్ కల్యాణ్ సభలో వివరించారు. లడ్డూల కోసం వినియోగించిన 68 లక్షల కిలోల నెయ్యిలో పాల చుక్క కూడా లేదని, పామాయిల్, ప్రమాదకర రసాయనాలతో దాన్ని తయారు చేశారని సిట్ తేల్చి చెప్పిందన్నారు. ఈ కేసులో 36 మందిని నిందితులుగా చేర్చారని, ఇది శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు ప్రణాళిక ప్రకారం జరిగిన కుట్రగా సిట్ అభివర్ణించిందని తెలిపారు. 2019-24 మధ్య కాలంలో విక్రయించిన 48 కోట్ల లడ్డూలలో సుమారు 20 కోట్ల లడ్డూలు ఈ నకిలీ నెయ్యితోనే తయారయ్యాయని టీటీడీ రికార్డులు చెబుతున్నాయని, తద్వారా 11 కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి పంపిన లక్ష లడ్డూలు కూడా ఈ కల్తీ నెయ్యితో చేసినవేనని ఆయన పేర్కొన్నారు.



### టెండర్ నిబంధనల మార్పుతోనే కుట్ర

గత ప్రభుత్వ హయాంలో తమకు నచ్చిన సంస్థలకు నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టేందుకే ప్రణాళిక ప్రకారం టెండర్ నిబంధనలను నీరుగార్చారని పవన్ ఆరోపించారు. నెయ్యి సరఫరా చేసే సంస్థకు ఉండాల్సిన కనీస వార్షిక టర్నోవర్‌ను రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు తగ్గించారని, రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సేకరించాలన్న నిబంధనను తొలగించారని, మూడేళ్ల అనుభవాన్ని ఏడాదికి కుదించారని వివరించారు. ఈ మార్పుల తర్వాత కాంట్రాక్టు దక్కించుకున్న 'బోలే బాబా', 'వైష్ణవి డైరీస్' వంటి సంస్థలకు కనీస అర్హతలు కూడా లేవని సిట్ చార్జిషీట్‌లో పేర్కొన్నట్లు తెలిపారు.

### ఇది హిందూ ధర్మంపై దాడి


ఈ వ్యవహారంపై తాను స్పందించకపోవడం పట్ల పశ్చాత్తాపంతోనే దీక్ష చేశానని పవన్ గుర్తుచేసుకున్నారు. ఇది కేవలం కల్తీ వ్యవహారం కాదని, హిందూ ధర్మంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. "ఇదే ఘటన ఏ ఇతర మతానికి జరిగినా దేశం, ప్రపంచం గగ్గోలు పెట్టేవి. హిందువులు కులాల పేరుతో విడిపోయి ఉండటం వల్లే మన ధర్మంపై దాడులు జరుగుతున్నప్పుడు తీవ్రత ఉండటం లేదు. ఇతర మతాల వారి ఐక్యతను చూసి మనం నేర్చుకోవాలి," అని అన్నారు. తప్పు చేసిన వారిని వెనకేసుకొస్తున్న వారు తిరుమల వెళ్లి ఆ స్వామి కళ్లలోకి ఎలా చూడగలరని ప్రశ్నించారు. శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్త మాల్యదలో చెప్పిన పద్యాన్ని ఉటంకిస్తూ, దేవుడి సొమ్ముపై ఆశ ఉన్నవారికి ఆలయ అధికారం ఇవ్వరాదని, అలా ఇస్తే రాజ్యమే నాశనమవుతుందని ఆ పద్యం చెబుతోందని, గత ప్రభుత్వంలో సరిగ్గా అదే జరిగిందని పవన్ విమర్శించారు. ఈ పాపానికి పాల్పడిన దోషులు ఎవరైనా వారికి శిక్ష పడాల్సిందేనని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు పార్టీలకు అతీతంగా అందరూ ఏకకంఠంతో ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

నిర్భయం

బుధవారం, ఫిబ్రవరి 25,2026

# మంగళ పాడ్ గ్రామంలో కుల బహిష్కరణ కలెక్టర్ ఫిర్యాదు చేసిన యువకుడు

ఎడపల్లి ఫిబ్రవరి 24 వార్త నిర్భయం:నిజామాబాద్ జిల్లా, ఎడపల్లి మండలం పరిధిలోని మంగల్ పహాడ్ గ్రామంలో చట్టవిరుద్ధ కుల బహిష్కరణ ఘటన వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళనకు దారి తీసింది. గ్రామానికి చెందిన రఘుపతి అబ్బయ్య తన కుటుంబంపై కుల సంఘం పెద్దలు అన్యాయంగా విధించిన బహిష్కరణపై జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణి ద్వారా లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.బాధితుడి వాఖ్యాన ప్రకారం, తన స్వంత భూమిని ఒక వ్యక్తి అక్రమంగా కబ్జా చేయడానికి యత్నించగా, ఆ విషయాన్ని కుల పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయితే సమస్యను న్యాయ బద్ధంగా పరిష్కరించాల్సిన స్థానంలో ఉన్న పెద్దలు, వివాదాస్పద భూమిని ప్రత్యర్థి వ్యక్తికే అప్పగించాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపించారు.అదేవిధంగా, రాజీ పేరుతో డబ్బు తీసుకుని వ్యవహారాన్ని ముగించాలనే సూచనలు చేసినప్పటికీ తాను నిరాకరించడంతో ప్రతీకార ధోరణిలో తన కుటుంబాన్ని కుల బహిష్కరణకు గురిచేశారని వెల్లడించారు.కుటుంబ సభ్యులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనరాదని, బహిష్కరిచబడిన కుటుంబంతో వివాహ సంబంధాలు కుదిరినా రూ. 12,000 జరిమానా విధిస్తామని బెదిరింపులు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్యలతో కుటుంబం తీవ్రమైన మానసిక వేదనకు గురైందని, కుటుంబ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు.కుల బహిష్కరణ భారత రాజ్యాంగ విరుద్ధమని, తక్షణమే విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు జిల్లా



అధికారులను కోరారు. ఈ ఘటనపై అధికార యంత్రాంగం స్పందన ఏమిటన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# కుమ్మెర మల్లన్న జాతర 02 నెలలు చిన్నారిమృతి

### గుండెలు పగిలి ఆ తల్లి రోదన

నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 24( వార్త నిర్భయం )



కులం ఎక్కడుంది అని అడిగే కబోదులారా. మనమంతా ఒకటేఅనే కపట దేశభక్తు లారాతక్కువ కులంఅని పాలు తాగే పసికందును పాదాల కింద నలిపి చంపుతుంటే.మీ భారతీయత ఏమైంది.ఆ పగిలిన పసిపాప లేత ఎముకల చప్పుడులో.మీ ఆచారాల ముసుగు లోని కుల ఉగ్రవాదంక నిపించ లేదాసరిహద్దుల్లో కాదు, మన గడపల్లో. మనుషుల మెదళ్లలో పాతుకుపోయిన అసలైన మృత్యు నిర్మాణం ఈ కులంగుండెలు పగిలే ఆ తల్లి రోదన సాక్షిగా. మానవత్వాన్ని మట్టిలో కలిపేసిన ఈ నకిలీ సమాజం మీద ఉమ్మేయండి.ఆ పసిపాప నెత్తుటి సాక్షిగా చెబుతున్నా.



చంపింది వాడొక్కడే కాదు చూస్తూ మౌనంగా ఉన్న నువ్వు, నేను, ఈ దేశం.మొత్తం సామూహిక హంతకులమే ఇలాంటి రాజకీయాలు ప్రజలకు ఎక్కడికి వెళ్లాలన్న భయాందోళన ఇంత దుర్మార్గమైన ఘటనపై ఇప్పటివరకు ముఖ్యమంత్రి స్పందించకపోవడం నిజంగా ముఖ్యమంత్రి కున్న బల్బుని అహంకారాన్ని తెలియజేస్తుంది ఇది ప్రజా పాలన కాదు ప్రజా పీడన కులగజ్జి తో కుల పిచ్చితో రెండు నెలల పాపని చంపిన



రెడ్డి కాంగ్రెస్ నాయకులు ఊరు వదిలి పారిపోతే ఇప్పటివరకు వాళ్ల మీద ఎఫ్ ఐ ఆర్ లేదు అరెస్టు లేదు కనీసం స్పందన లేదు రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడంలో చూపించే శ్రద్ధ వాల మీద కేసులు పెట్టడంలో చూపించే శ్రద్ధ తెలంగాణలో గాడి తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు చనిపోయిన కుటుంబానికి సానుభూతి కూడా కాంగ్రెస్ నాయకులు తెలపడం లేదు

# ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

సూర్యాపేట బ్యూరో ఫిబ్రవరి 24 వార్త నిర్భయం

సూర్యాపేట మున్సిపల్ కి సంబంధించిన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా అని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రం శ్రీ వేదాంత భజన మందిరం ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో 39 వ వార్డు కౌన్సిలర్ దంతాల సాయి ప్రియ, సందీప్, 23 వ వార్డు కౌన్సిలర్ వల్దసు లక్ష్మి, శ్రీను(రెబల్) తో పాటు వారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. 24వ వార్షికోత్సవం సందర్భంగా ఈ దేవాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొనడం మా అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు.



అనంతరం ప్రధాన అర్చకులు సింగరాచార్యులు మాట్లాడుతూ. 24వ వార్షికోత్సవం సందర్భంగా విచ్చేసిన అతిథులకు శేష వస్త్రాలతో చిరు సన్మానం చేయడం జరిగిందని అన్నారు. అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర



రావు, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాజశేఖర్, సామ అశోక్, సుమన్, అర్చకులు రాఘవాచార్యులు, రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజ్,ధనంజయ, రవి, వీరవెల్లి రామ్మూర్తి, బజ్జూరి శ్రీనివాస్, శీల శంకర్, సత్యనారాయణ, వెంపటి నరేష్, రాచర్ల ప్రేమ్ లత, నకిరేకంటి హేమలత, గోదాదేవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

**మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి**

హైదరాబాద్ ఫిబ్రవరి 24 (వార్త నిర్భయం)మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు.ఉప్పల్ కేకేఆర్ గార్డెన్స్ లో లావణ్య ఫౌండేషన్‌లి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్కీ డ్రా నిర్వహించారు. డ్రాలో నిలిచిన స్వప్న గారు, సరళ గారు, మహాలక్ష్మి గారికి కుట్టు మిషన్లను రజిత పరమేశ్వర్ రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని ఈ సందర్భంగా రజితాపరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి పథకం కింద 500 రూపాలు కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తుందన్నారు. చిరు వ్యాపారులకు, మహిళా పారిశ్రామికవేత్తలకు వడ్డీలేని రుణాలను అందిస్తూ చేయూతనిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గారు మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్టుగా గుర్తు చేశారు. కార్యక్రమంలో లావణ్య ఫౌండేషన్ ఫౌండర్ లావణ్య , సంధ్య , టీచర్స్ వాణి , మాధురి గారు, నవనీత , లింగంపల్లి రామకృష్ణ, భూసం రంగనాథ్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల దేవి రెడ్డి, గోరిగే మహేష్, సురేష్, బాలరాజ్, అలుగుల అనిల్, అల్వాల్ భాస్కర్, ప్రేమ్,పూజారి హనుమంతు, మా శెట్టి రాఘవేంద్ర,



తుమ్మల రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, మోహన్ నాయక్, ప్రశాంత్ రెడ్డి, బచ్చా రాము, రంగుల శేఖర్, శశికాంత్ రెడ్డి, వంశీ గౌడ్, మరియు ఇతరులు పాల్గొన్నారు.

# సమయ పాలన లేని అధికారులు.

**ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

**సమయపాలన పట్ల అధికారులు నిర్లక్ష్యం.**

**ఉదయం 10.40 గంటలకు కార్యాలయానికి రాని ప్రభుత్వ అధికారులు.**

**ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్న వివిధ శాఖల కార్యాలయం అధికారులు.**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ యూత్ జిల్లా జి.రవికుమార్.

వనపర్తి ప్రతినిధి ఫిబ్రవరి 24 (వార్త నిర్భయం) మదనాపురం మండలం అధికారుల తీరు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది సమయపాలన లేక విధులు నిర్వహిస్తున్న అధికారుల పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వ అధికారులు సమయపాలన విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని,తీరు మార్చుకోకపోతే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ యూత్ వనపర్తి జిల్లా జి.రవికుమార్ హెచ్చరించారు.వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో వివిధ శాఖలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు సమయ పాలన పాటించని ఉద్యోగులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...17గ్రామాల ప్రజలు తమకు అవసరమైన వివిధ రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడం కోసం అవసరమైన సర్టిఫికెట్ల కోసం కార్యాలయానికి వస్తుంటారని తెలిపారు.అధికారులు సకాలంలో రాక పోవడంతో కార్యాలయాల ముందు ప్రజలు,రైతులు, విద్యార్థులు అడిగా పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆరోపించారు.సమయానికి రాకపోవడం వల్ల ప్రజా సేవలకు ఆటంకం కలుగుతుందని,అధికారులు బాధ్యతగా వ్యవహరించి సమయపాలన పాటించాలని తెలిపారు.ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సమయపాలనతో పాటు తమ విధులను సక్రమంగా నెరవేరుస్తారని సూచించారు.కానీ ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం సమయపాలన



పాటించకుండా పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయమే కదా తమ ఇష్టం వచ్చిన సమయానికి రావచ్చన్న ధీమాతో ఉద్యోగులు ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉదయం 10.40 గంటల సమయం అవుతున్న మండల కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయంటే ప్రభుత్వ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో కాలి కుర్చీలను చూస్తే అర్థమవుతుందని కోరారు.ఇప్పటికైనా సమయపాలన పాటించని ఉద్యోగులను గుర్తించి జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అన్నారు

# గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులకు శిక్షణ తరగతులు

ఎడపల్లి ఫిబ్రవరి 24 వార్త నిర్భయం :ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఎడపల్లి ఎంపీడీవో శంకర్ మంగళవారం తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 166 మంది వార్డు సభ్యులకు రెండు విడుదలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధులు, వాటిని వెచ్చించే వాటిపై శిక్షణ



ఉంటుందన్నారు. ఎంపీడీవో శంకర్, ఎంపిఓ మన్మోహన్ శాస్త్రి, టీఓటీలు క్యాతప్ప, శ్రీనివాస్, ఈశ్వర్, రామకృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.



## పెద్ద రాజమూర్ పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు



దేవరకద్ర ఫిబ్రవరి 24 (వార్త నిర్భయం ) : –దేవరకద్ర మండల పరిధిలోని ఎంపియుపిఎస్ పెద్దరాజమూరు పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠశాల కార్యక్రమాలను చక్కగా కొనసాగించారు. పాఠశాల పాఠశాలకు చెందిన విద్యార్థులు హెచ్‌ఎంగా అభిరామ్, టీచర్స్ గా ప్రత్యూష, అనన్య, దీక్షిత, కృష్ణప్రియ, శైలజ, మానస, ప్రణీత్, సురేందర్, భరత్, అజయ్, పీఈటీగా దేవరాజు లు పాఠశాలలో విధులను చక్కగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించడం ఎంత కష్టమోనని, విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దడం లాంటి విధులను ఉపాధ్యాయులు ఎంత నిబద్ధతతో పని చేస్తారో నని స్వయంగా తెలుసుకున్నామన్నారు. అనంతరం చక్కగా బోధించిన స్టూడెంట్ టీచర్లకు మొదటి, రెండవ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క స్టూడెంట్ టీచర్లకు ప్రోత్సాహక బహుమతులు పాఠశాల హెచ్‌ఎం డి .కవిత అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి కవిత, ఉపాధ్యాయులు కే శంకర్, కే వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశంతో మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



దేవరకద్ర ఫిబ్రవరి 24( వార్త నిర్భయం ) : –మృతిని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి ఉషనప్ప, దేవరకద్ర మండల పరిధిలోని గూర కొండ గ్రామంలో గ్రామంలో గదం అంజమ్మ భర్త కొండన్న గత కొన్ని రోజులుగా అనారోగ్య కారణంతో బాధపడుతూ మంగళవారం మరణించరు. ఈ విషయం ఎమ్మెల్యే జిఎంఆర్ తెలుసుకోని గ్రామంలోని కాంగ్రెస్ నాయకులకు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశం మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గ్రామ సర్పంచ్ దాసరి చిన్నమ్మ ఉషనప్ప, వారి నివాసానికి వెళ్లి పార్థిక దేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇళ్లు పేదవారి ఆత్మ గౌరవ ప్రతీక.

## ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.



వనపర్తి ప్రతినిధి ఫిబ్రవరి 24 (వార్త నిర్భయం)

కొల్లాపూర్, ఫిబ్రవరి 24: ఇందిరమ్మ ఇళ్లు పేదవారి ఆత్మ గౌరవ ప్రతీక అని ప్రోహిబిషన్ ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.పేర్కొన్నారు. మంగళవారం మందాపురం, కొత్తపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల గృహ ప్రవేశం సందర్భంగా మంత్రి జూపల్లి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు.అనంతరం కొత్తపేట, బహదూర్ గూడెంలో గ్రామ పంచాయతీల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పల్లెల అభివృద్ధి, పేదల సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తూ పేద కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించామని వివరించారు.రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీని విజయవంతంగా అమలు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బాంధవుడిగా నిలిచారని మంత్రి కొనియాడారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## కంటిపరీక్ష మరియు శాస్త్ర చికిత్స శిబిరము.

## లయన్స్ క్లబ్ ఆఫ్ జడ్చర్ల వారి ఆధ్వర్యంలో విజయవంతం.




జడ్చర్ల ఫిబ్రవరి 24 (వార్త నిర్భయం)

లయన్స్ క్లబ్ ఆఫ్ జడ్చర్ల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష, శస్త్రచికిత్స శిబిరము విజయవంతంగా నిర్వహించారుఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి ,జడ్చర్ల మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత ,లయన్స్ క్లబ్ జడ్చర్ల చార్టర్ ప్రెసిడెంట్ డా.రామిరెడ్డి కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో 600మందికి పైగా కంటిపరీక్షలు నిర్వహించడం జరిగింది.దాదాపు 360 మందికి కళ్ళద్దాలు ఇవ్వడం జరిగింది.80మందికి శాస్త్ర చికిత్స ఈ వారం లోపు పూర్తి ఉచితంగా నిర్వహిస్తామని తెలియజేశారు.పై కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలకు పేరు పేరున ధన్యవాదాలు తెలియచేశారు.కార్యక్రమంలోలయన్స్ క్లబ్ ఆఫ్ జడ్చర్ల అధ్యక్షులు ధ్రువ బాదిమి ,సెక్రటరీ కాల్వ రామిరెడ్డి గారు, కోశాధికారి కొండూరి వెంకటేష్ గారితో పాటు క్లబ్ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి బాధ్యత ఈత పౌరుడిగా ఎదగాలి

**విద్యార్థి దశలోనే సమాజ అభివృద్ధికి కీలకం కావాలి**

**సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి**

**చట్ట విరుద్ధ చర్యలను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందివ్వాలి**

**కల బృందం సభ్యులతో సమాజంలో జరుగుతున్న వివిధ నేరాలపై అవగాహన**

**సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులకు వివరించారు**

**జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఆదేశాల మేరకు,**

దేవరకద్ర ఫిబ్రవరి 24 (వార్త నిర్భయం): – మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి ధరావత్ ఆదేశాల మేరకు మంగళవారం దేవరకద్ర మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామ శివారులో గల కాకతీయ మోడల్ హై స్కూల్ లో మంగళవారం యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ పోలీస్ తరపున మహబూబ్నగర్ జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుజాత, మహబూబ్నగర్ జిల్లా పోలీస్ కళాబృందం తరపున డి రాములు జగదీష్ బాలరాజ్ సి టీం అవగాహన సదస్సు బృందం తరపున అఖిల్ భాగస్వామ్యంలో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మహిళా భద్రత, సైబర్ నేరాల నివారణ, చైల్డ్ ట్రాఫికింగ్, ఈవ్ టీజింగ్ మత్తు పదార్థాల ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉమెన్ పి.ఎస్ ఇన్స్పెక్టర్ సుజాత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాధ్యతాయుత పౌరుడిగా ఎదగాలని, ప్రతి ఒక్కరు సమాజ అభివృద్ధికి పాటుబడడంలో కీలకం మారాలన్నారు. సోషల్ మీడియా వినియోగంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలన్నారు. చట్టవిరుద్ధ చర్యలను గుర్తించినప్పుడు వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ గౌని రాయిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం ద్వారా సమాజ చైతన్యానికి కృషి చేస్తున్న జిల్లా ఎస్పీ జానకి, అవగాహన కల్పిస్తున్న కళ బంధానికి పోలీసులకు ప్రత్యేక ధన్య




వాదాలు తెలియజేశారు. సి టీం అఖిల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అక్కడక్కడ ఆడవారిపై జరుగుతున్న దాడుల్లో నుంచి రక్షించేందుకు అప్రమత్తత అవగాహన కలిగి ఉండాలని, అమ్మాయిలు చదువుల వలన కుటుంబం స్థితిగతులు మారడంతో పాటు సమాజం అభివృద్ధిని సాధిస్తుందని తెలియజేశారు. కళా బృందం సభ్యులు సమాజంలో జరుగుతున్న వివిధ నేరాలపై అవగాహన కల్పించే సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులను ఆకట్టుకు న్నారు. విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.

# పుట్టుకలో నైతికత ఉంటే బహిరంగ క్షమాపణ చెప్పాలి.

**పెబ్బేర్ సంత స్థలం పేరిట**

**భారీ అవినీతి, దోపిడికి కుట్ర.**

**నన్ను ఎదుర్కొనలేక మూర్ఖులు వేదాలు నేనేదో కబ్జా చేశానని దుష్ప్రచారం**

**సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రి.**

వనపర్తి ప్రతినిధి ఫిబ్రవరి 24 (వార్త నిర్భయం)పుట్టుకలో నైతికత ఉంటే ఇచ్చిన మాట ప్రకారం సంత స్థలం ప్రభుత్వానిదే అని బోర్డు పెట్టాలి స్వాధీనం చేసుకోవాలిభూ సేకరణ పేరిట నాటకాలెందుకు.ప్రజలను వంచించడానికా. రాజకీయ లబ్దికోసం విషప్రచారం చేసిన వెధవ,రండ నాయకులు మాకు,ప్రజలకు క్షేమాపణలు చెప్పాలి. సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రివర్యులు.గత మూడు దశాబ్దాలుగా న్యాయస్థానంలో పెబ్బేర్ సంత స్థలవివాదం సర్వే నంబర్ 392 భూ యజమానులకు, దేవాదాయ శాఖ కు మధ్య కొనసాగుతున్నదని పలుమార్లు. భుయజమాను లకు.వరుసగా 2003,2007,2022అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగిందని పత్రికా సమావేశంలో నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.విషయములోన్యాయస్థానాన్ని అతిక్రమించి రాజకీయ లబ్దికోసం ఎన్నికల సమయములో 30ఎకరాల 19గుంటలు మొత్తం ప్రభుత్వానిదేనని ఇందులో నేను కబ్జా చేయడానికి కుట్ర చేస్తున్నాను అని నీచమైన,నిరదారణమైన ఆరోపణలు చేసి ఒక్కటంటే ఒక్క నెలలో సంత స్థలం మొత్తం ప్రభుత్వపరం చేసుకుంటామని బీరాలు పలికిన నాయకులు మూడేండ్లు గడుస్తున్నా నేటికి మాట నిలబెట్టుకోకుండా పోవడమే కాకుండా నేడు భూసేకరణ పేరిట భారీ దోపిడికి కుట్ర చేయడం సిగ్గుచేటైన విషయం అని నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. పెబ్బేరు ప్రజల,వ్యాపారస్తుల క్షేమం కోసం భూ యజమానులతో ప్రభుత్వపరంగా సంత కోసం 16ఎకరాలు ఇస్తే ప్రత్యామ్నాయంగా వ్యవసాయ భూమి ఇప్పిస్తామని ఒప్పించి యజమానులతో అంగీకార పత్రం(గిఫ్ట్ డీడ్)ఇప్పించేశామని ఇంతలో ఎన్నికలు రావడం పోటీలో ఉన్న మూర్ఖులు,వెధవలు రాజకీయంగా నన్ను ఎదుర్కొనలేక నేనేదో కబ్జా చేశానని దుష్ప్రచారం చేశానని ప్రచారం చేశారని అన్నారు.నేడు న్యాయస్థానం 30ఎకరాల 19గంటల భూమి యజమానులకు చెందుతుందని తీర్పు ఇవ్వడంతో ప్రగల్భాలు పలికిన నాయకులు ఎక్కడని నిరంజన్ రెడ్డి దుయ్యబట్టారు భూసేకరణ పేరిట భారీ అవినీతికి,దోపిడికి కుట్ర. 30ఎకరాల 19 గుంటల భూమి ఎటువంటి పరిహారం ఎవరికి ఇవ్వకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని సంతకు వినియోగిస్తామని కుర్చీ వేసుకొని ఒక్క నెలలో ప్రహరీ గోడ కడతామని ప్రగల్భాలు పలికిన రండ,అసమర్థ నాయకులు న్యాయస్థాన తీర్పుతో ఖంగుతిని ప్రజల ముందు అభాసుపాలు అవుతామని భూసేకరణ పేరిట భారీ దోపిడికి తెరలేపారని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం భూ యజమానులకు సంత స్థలంకు ప్రత్యామ్నాయంగా మన జిల్లా సరిహద్దులు దాటి అత్యంత విలువైన భూమిని ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరలో ఇప్పిస్తామని ఇందులో ముఖ్యమంత్రి గారి సోదరుణ్ణి సహాయం తీసుకుంటున్నామని మేకిచ్చే



భూమిలో సగం భూమికి వారికి ఇవ్వాల్సి ఉంటుందని భూయజమానులతో సంప్రదించడంతో వేల కోట్ల దోపిడికి కుట్ర చేశారని ఆరోపించారు.ఇంత అవినీతికి తెరలేపిన మీరు కబ్జాకోరులా....ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా ఉన్నంతలో సంత స్థలాన్ని కాపాడాలనుకున్న నేను కబ్జాకోరునా అని ప్రశ్నించారు.అకారణంగా ఆనాడు నాపై దుష్ప్రచారం చేసిన మీ పుట్టుకలో నైతికత ఉంటే మాకు ప్రజలకు బహిరంగ క్షేమాపణ చెప్పి తదుపరి కార్యాచరణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఈ సమావేశములో వనం.రాములు,దిలీప్ రెడ్డి, కర్రెస్వామి,కౌన్సిలర్స్ సౌజన్య మన్యం,పెద్దింటి.వెంకటేష్,ఎం.రాజశేఖర్,విశ్వరూపం,ఎద్దుల.ని
ాయి,గోపి,సహదేవుడు,శేఖర్ గౌడ్,వడ్డే. రమేష్, రామకృష్ణ,శ
ంభు.రాము, రాములు,భారతి ,మాధవ్ రెడ్డి,నరేష్, మొగిలన్న, అంజి,రాములు, పరమేశ్, అఖిల్,గిరి, వసంత్, సురేష్, శ్రీను,సోహెల్,మూర్తి,వేణు,ఉదయ్‌పవన్,నరేందర్ పాల్గొన్నారు.

# ఇంటర్ పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి.

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**

వనపర్తి ప్రతినిధి ఫిబ్రవరి 24 (వార్త నిర్భయం)
వనపర్తి జిల్లాలో ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హైదరాబాద్ నుంచి, ఇంటర్మీడియట్, పదవతరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలిసి, అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ లకు సూచించారు. పరీక్షల నిర్వహణపై పలు అంశాలను చర్చించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా, పరీక్షల సమయాలకు అనుగుణంగా బస్సులను నడపాలని ఆదేశించారు. పరీక్షలు జరుగుతున్నతసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు మూసివేసి, బిఎన్ఎస్ సెక్షన్ 163 (సీఆర్పీసీ 144) అమలు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణపై వివరాలను జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, ఇప్పటికే ఇంటర్ పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇంటర్మీడియట్, పదవతరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇంటర్మీడియట్ కు సంబంధించి బుధవారం నుంచి జిల్లాల్లో మొత్తం 12,653 మంది విద్యార్థులు హాజరువుతున్నట్లు తెలిపారు. వారిలో ప్రథమ సంవత్సరం 6,216 మంది విద్యార్థులు, 6,437 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 25 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని అన్నారు. పదవ తరగతి పరీక్షలకు సంబంధించి మార్చ్ 14వ తేదీ నుంచి, ఏప్రిల్ 16 వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి, 12.30 వరకు, 37 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 7, 228 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని రకాలుగా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎలాంటి లోటుపాట్లకు తావు ఇవ్వొద్దని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద, ప్రశ్న పత్రాల తరలింపు సమయంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు జరుగుతున్నతసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం



కలుగకుండా చర్యలు తీసుకోవాలని వివరించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు మూసివేసి, బిఎన్ఎస్ సెక్షన్ 163 (సీఆర్పీసీ 144) అమలు చేయాలని అన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు, విద్యార్థులకు సౌకర్యవంతమైన బెంచీలు, సరైన లైటింగ్, సిబ్బందితో కూడిన వైద్య శిబిరం, తదితర అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా, పరీక్షల సమయాలకు అనుగుణంగా బస్సులను నడపాలని పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా, పారదర్శకంగా పరీక్షలను పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, జిల్లా ఇంటర్మీ డియట్ విద్యా శాఖ అధికారి అంజయ్య, ఇతర సంబంధిత శాఖలఅధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# పడకేసిన వనపర్తి మున్సిపాలిటీ పాలన

**ఏ కాల్వ చూసిన చెత్తాచెదారం దుర్గంధం**

**డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడం మున్సిపల్ విఫలం**

**-పేరుకుపోయిన ప్లాస్టిక్,మురుగు మట్టి**

వనపర్తి ప్రతినిధి ఫిబ్రవరి 24, (వార్త నిర్భయం) వనపర్తి కేంద్రంలోని పట్టణ కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడం లో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్, మురుగు మట్టి పేరుకుపోవడంతో దుర్గంధం సోమవారం అర్ధరాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపైకి వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు,ప్లాస్టిక్ పై వ్యాపారులకు అవగాహన కల్పించని మున్సిపల్ అధికారులు.రాత్రి కుర్చునా కొద్దిపాటి వర్షానికి డ్రైనేజీ లో నిండిపోవడంతో వ్యర్థాలు రోడ్డుపై చేరాయి. పలు కాలనీలో డ్రైనేజీ లలో అధిక శాతం చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల బెడద వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలుస్తుంది. హటరీటల్స్, షాపింగ్ మాల్స్ కొంత సిబ్బంది భాధ్యత రహితంగా చెత్తను డ్రైనేజ్ వెయ్యడం ద్వారా నాళాలు పేరుకు పోతున్నాయి.కావున అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని కోరుతూ పలు కాలనీలలో సి. సి రోడ్లపై ఇష్టారీతిన త్రవ్వకాలు చేసి వాటిని పునరుద్ధరణ చెయ్యడం లేదని సి. సి రోడ్లు ధ్వంసం చేస్తున్న వారికి అధికారులు ఎలా అనుమతులు ఇస్తున్నారు. అనుమతి లేకుండా సీసీ రోడ్లను ధ్వంసం చేసిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోవట్లేదు ఇప్పటికే కొన్ని కాలనీలు గుంతల మాయంగా మారాయనీ తెలిపారు. పేరుకే ప్లాస్టిక్ నిషేధంవనపర్తి జిల్లాలో ఉదయం నుంచి రాత్రి వరకు కూరగాయలు, పాల ప్యాకెట్లు, పండ్లు, టిఫిన్లు, మాంసం, నిత్యావసర సరుకులు, దుస్తులు ఇలా ఏ వస్తువు ఇంట్లోకి వచ్చినా వాటితో పాటు ప్లాస్టిక్ వస్తువులు కూడా యథేచ్ఛగా వస్తున్నాయి. పాలిథిన్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు అవ్వాలి అనే నినాదం ప్రాధాన్యత కనిపించడం లేదు. విక్రయించే వారిపై ఉక్కు పాదం మోపుతాం, ప్రజలు ప్రత్యామ్నాయ వస్త్ర, జూట్ బ్యాగులను వినియోగించాలి అంటూ అధికార యంత్రాంగం, నేతలు చెప్పడమే కానీ ఆచరణలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. క్షేత్రస్థాయిలో వాటిని కట్టడి చేయడంలో అవగాహన కల్పించడంపై సరైన దృష్టి సారించక, తనిఖీలు లేక ఇష్టారీతిగా అమ్మకాలు, వినియోగం గతంలో లాగే జోరుగా సాగుతున్నాయి.

**మురుగునీటి సరఫరాకు అడ్డుపడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు**

బహిరంగ ప్రదేశాలు ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి కనిపిస్తున్నాయి. వినియోగదారులు పాలిథిన్ కవర్లను ఇష్టారీతిన వాడేసి ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు.



వర్షాకాలం వరద నీటికి ప్లాస్టిక్ కవర్లు కొట్టుకువచ్చి మురుగు కాలువలు, కెనాళ్లలో చేరి నీటి ప్రవాహానికి అడ్డుగా మారుతున్నాయి. మురుగునీరు సరఫరా కాకపోవడంతో వరద నీరు రోడ్లపై చేరి లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరుతోంది. వీటిని తొలగించడం పారిశుధ్య కార్మికులకు ఇబ్బందిగా మారుతుంది, వినియోగదారుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం వర్షాకాలంలో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

**హడావిడి ఎక్కువ ఫలితం తక్కువ**

దేశంలోని ప్రతి మనిషి సగటున ఏడాదికి 11 కిలోలకు పైగా ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తేల్చి చెప్పింది. దీంతో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ నిషేధంపై యంత్రాంగం కొద్ది రోజులు హడావిడి చేసి చిరు వ్యాపారులపై జరిమానాలు విధించి అనంతరం మరిచిపోయారు. దీంతో నాలుగు రోజులు హడావిడి అని అటు వ్యాపారులు, ఇటు ప్రజలు సీరియస్ గా తీసుకోవడం లేదు.

# మున్సిపల్ చైర్మన్ 10వార్డ్ కౌన్సిలర్ పుట్ట అరుణ చంద్రమౌళికి ఘన సన్మానం




దేవరకద్ర ఫిబ్రవరి 24 వార్త నిర్భయం : –
దేవరకద్ర మున్సిపాలిటి చైర్మన్ దమయంతి కొండ గోవర్ధన్ రెడ్డిని, దేవరకద్ర మున్సిపాలిటి 10 వార్డు కౌన్సిలర్ పుట్ట అరుణ చంద్రమౌళిని మంగళవారం మర్యాదపూర్వకంగా బలుసుపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు అందరు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# గణిత ప్రతిభా పరీక్ష దిఏదుల




ఏదుల ఫిబ్రవరి 24( వార్త నిర్భయం) ఏదుల మండల పరిధిలోని అన్ని పాఠశాలలకు 3–5 తరగతుల విద్యార్థులకు గణితంలో టేబుల్స్ గేమ్ కాంపిటీషన్ మండల విద్యాధికారి శ్రీ ప్రభాకర్అధ్యక్షతన పెద్దలు కాంగ్రెస్ నాయకులుశ్రీ పందెం సుఖేందర్ రెడ్డిసహకారంతో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పందెంసుఖేందర్ రెడ్డిమాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి గణితంపై పట్టు సాధించాలని గణితం జీవితానికి మొదటి మెట్టనిఆయన పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరపడానికి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని పేర్కొన్నారు. మొదటి బహుమతి 4000/- పి. మేఘన నా/రాఖాసిం, చీర్కపల్లి, రెండవ బహుమతి 3000/- గీతాంజలి అనంతపురం మూడవ బహుమతి 2000/- ధనుష్ మాచుపల్లి నాలుగో బహుమతి 1000/- అన్విత ఏదుల ప్రోత్సాహక బహుమతి 500/- భరత్ చీర్కపల్లి ఈ కార్యక్రమంలో గెలుపొందారు.శ్రీ పందెం సుఖేందర్ రెడ్డి ఈ బహుమతిలో డబ్బు మాత్రమే కాదు పిల్లల యొక్క జీవితానికి ప్రోత్సాహం అని ఆయన పేర్కొన్నారు. ఇలా టేబుల్ గేమ్ కాంపిటీషన్ నిర్వహించి దానికి దాతగా వ్యవహరించడం నా అదృష్టంగా భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే జిఎంఆర్ సహకారంతో మున్సిపాలిటీలో ప్రజల సమస్యలు పరిష్కారం చేస్తాం

**మునిసిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి**



దేవరకద్ర ఫిబ్రవరి 24 వార్త నిర్భయం : -ఎమ్మెల్యే జిఎంఆర్ సహకారంతో దేవరకద్ర మున్సిపాలిటీలోని ప్రజల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ దమయంతి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని తాయమ్మ కాలనీ ఏరియా లో చైర్మన్, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, నరేష్ బాబు, ఈవో సిత్యా నాయక్, కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశం తో వార్డుల వారిగా తిరుగుతూ ప్రజల సమస్యలను పరిశీలిం చడం ప్రజలతో వారి సమస్యలను తెలుసుకొని నోట్ చేయించుకుంటూ ప్రజల సమస్యల పరిష్కార దిశగా ఎమ్మెల్యే జిఎంఆర్ తో చర్చించి ప్రజల సమస్యలను పరిష్కార దిశగా ముందుకు తీసుకెళ్తామని వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి తెలిపారు. వీరితోపాటు అధికారులు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# ఉదయ్ కుమార్ ను పరామర్శించిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



దేవరకద్ర ఫిబ్రవరి 24 వార్త నిర్భయం : – దేవరకద్ర నియోజకవర్గంలోని
కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన ఉదయ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాదులో చికిత్స పొందున్నారు. ఈవిషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మంగళవారం హైదరాబాద్ లో ఉదయ్ కుమార్ నివాసంకు వెళ్లి ఆయనను పరామర్శించారు. వీరితోపాటు దేవరకద్ర మాజీ వైస్ ఎంపిపీ సుజాత శేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, తదితరులు ఉన్నారు

# రాష్ట్ర ప్రభుత్వానికి రూ.583 కోట్లు చెల్లించిన బ్యాంక్! ఎందుకో తెలిస్తే షాక్ అవుతారు!

ఐడిఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ హర్యానా ప్రభుత్వ ఖాతాల్లో జరిగిన రూ.583 కోట్ల మోసాన్ని ధృవీకరించింది. దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ, బ్యాంక్ అసలు, వడ్డీతో సహా మొత్తం మొత్తాన్ని సంబంధిత ప్రభుత్వ విభాగాలకు తిరిగి జమ చేసింది. ఈ మోసంలో నలుగురు లేదా ఐదుగురు మధ్య, దిగువ స్థాయి బ్యాంకు ఉద్యోగుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించారుప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మంగళవారం హర్యానా ప్రభుత్వ సంబంధిత విభాగాల ఖాతాల్లో అసలు, వడ్డీతో సహా మొత్తం రూ.583 కోట్లను జమ చేసినట్లు తెలిపింది.